



# కెరటం న్యూస్

( సామాన్యుడి ఆయుధం )






Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక : 226 | సోమవారం 18- ఆగష్టు 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695


## నిర్మాణ రంగంలో స్వదేశీ వస్తువులనే వాడాలి

### : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



**న్యూస్ డెస్క్,17 ఆగష్టు (కెరటం న్యూస్):** నగరంలో నిర్మాణ రంగం ఊపందుకుంటుందని, వినియోగదారుల ప్రయోజనాల మేరకు నిర్మాణరంగ సంస్థలు పనిచేయాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. హైటెక్స్‌లో నిర్వహించిన క్రెడాయ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా వస్తోన్న మార్పుల దృష్ట్యా బిల్డర్స్ స్వదేశీ వస్తువులనే ఉపయోగించాలని సూచించారు. నిర్మాణ రంగానికి ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు.

## ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల కలయికే ఇండియా.. మనం లేకుంటే దేశమే లేదు

### టీపీసీసీ చీఫ్



# విజన్ లేని సీఎం వల్ల ప్రజాధనం వృథా

●ఫార్మాసిటీ భూములు రియల్ ఎస్టేట్‌కు?: రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఆగ్రహం ● ఫ్యూచర్ సిటీకి భవిష్యత్తే లేదు ●రైతుల భూములతో మోసం: ఫార్మాసిటీ స్థానంలో రియల్ ఎస్టేట్ కుట్ర? ● ప్రజల కోసం సేకరించిన భూములు కుటుంబ లాభాల కోసం? ●ఫార్మాసిటీ రద్దుపై బీఆర్ఎస్ ఆగ్రహం – ప్రభుత్వం వెంటనే స్పందించాలి ●వందల కోట్ల పీఆర్ ఖర్చు, కానీ న్యాయ సమస్యల కూపంలో ప్రభుత్వం ●రైతుల వెనుక బీఆర్ఎస్ నిలుస్తుంది – కేటీఆర్ హామీ



**న్యూస్ డెస్క్,17 ఆగష్టు (కెరటం న్యూస్):** సీఎం రేవంత్ రెడ్డి పదే పదే చెప్పిన ఊహాజనిత ఫ్యూచర్ సిటీకి భవిష్యత్తు లేదని, కేవలం తన కుటుంబ సభ్యుల ప్రయోజనాల కోసం హైదరాబాద్ ఫార్మాసిటీ భూములలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలన్న రేవంత్ రెడ్డి ఆకాంక్ష నెరవేరదని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఫార్మాసిటీ భూముల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల పై కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజన్ లేని నాయకుడని, ఆయన తీసుకుంటున్న నిర్ణయాల వల్ల ప్రజాధనం వృధా అవుతుందని ఆయన ఆరోపించారు. ఫార్మా సిటీ కోసం భూములిచ్చిన రైతులు మోసపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫార్మా సిటీ ప్రాజెక్టును రద్దు చేసి, దాని స్థానంలో ఫ్యూచర్ సిటీ అనే అవాస్తవ, ఊహాజనిత ప్రాజెక్టును ప్రవేశపెట్టారని దుయ్యబట్టారు.

ఇది నిర్లక్ష్య నాయకుడు రాష్ట్రాన్ని పాలిస్తే ఏమవుతుందో దానికి ఫ్యూచర్ సిటీ ప్రచారం ఒక ఉదాహరణ అని పేర్కొన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం, ఒక నిర్దిష్ట ప్రజా ప్రయోజనం కోసం సేకరించిన భూమిని ఇతరుల ప్రయోజనం కోసం రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు మళ్లించడం సాధ్యం కాదని కేటీఆర్ స్పష్టం చేశారు.

## ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్



**న్యూస్ డెస్క్,17 ఆగష్టు (కెరటం న్యూస్):** అధికార ఎన్డీఏ కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ ఎంపికయ్యారు. ఈ మేరకు బీజేపీ పార్లమెంటరీ కమిటీ ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఎన్డీఏ కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిని ఖరారు చేసేందుకు ఆదివారం ఢిల్లీలోని కేంద్ర కార్యాలయంలో బీజేపీ పార్లమెంటరీ కమిటీ సమావేశమైంది.

## ఇదెక్కడి దిక్కుమాలిన ఆలోచన.. కాంగ్రెస్ పై ఈటల ఫైర్



**న్యూస్ డెస్క్,17 ఆగష్టు (కెరటం న్యూస్):** ఓట్లు, అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ దేశభద్రతనే పణంగా పెట్టడం మంచి పద్ధతి కాదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. ఇలాంటి చవకబారు ఆరోపణలు సరికాదని విపక్షాలను దుయ్యబట్టారు. ఎన్నికల కమిషన్ స్వతంత్ర సంస్థ అని సుప్రీంకోర్టు కూడా కొన్ని ఆదేశాలు జారీ చేసిందన్నారు. దాని ప్రకారం నిర్ణయాలు ఉంటాయి తప్ప దానికి పార్టీకి, ప్రభుత్వానికి ఏం సంబంధం ఉంటుంది.. ఆ మాత్రం అవగాహన లేకపోతే ఎలా? అని నిలదీశారు. ఇవాళ కరీంనగర్ లో పర్యటించిన ఆయన ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఓట్ చోరీ , స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలపై స్పందించారు.

## వాళ్ల వల్ల బీజేపీకి చాలా నష్టం జరుగుతోంది



**న్యూస్ డెస్క్,17 ఆగష్టు (కెరటం న్యూస్):** తెలంగాణ బీజేపీ పై గోషామహల్ ఎమ్మెల్యే టి. రాజాసింగ్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆదివారం ఆయన ఓ మీడియా ఛానల్ ప్రతినిధితో మాట్లాడారు. 'తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రాదు. ప్రతి నియోజకవర్గంలో, ప్రతి జిల్లాలో నా మనిషే అంటే, ఎన్నో ఏళ్ల నుండి ప్రాణం పెట్టి పనిచేసిన పాత కార్యకర్తలు ఎక్కడికి పోవాలి. బీజేపీ అధిష్టానం కూడా తెలంగాణ మీద దృష్టి పెట్టదు.. వాళ్ళు వేరే రాష్ట్రాలను చూసుకుంటారు. రాష్ట్రంలోని పెద్ద బాబులు చెప్పిందే అధిష్టానం వింటుంది. వాళ్ళ పేర్లు చెప్పలేను కానీ, వాళ్ళ వల్ల తెలంగాణ బీజేపీకి చాలా నష్టం జరుగుతుంది' అని రాజాసింగ్ తీవ్ర ఆరోపణలు చేశారు.

## బీసీల కోసం రెడ్లు, వెలమలు ప్రాణాలిచ్చినా అభ్యంతరం లేదు: తీన్మార్ మల్లన్న



**న్యూస్ డెస్క్,17 ఆగష్టు (కెరటం న్యూస్):** బీసీలకు తెలంగాణలో ఉన్న రెడ్లు, వెలమలకు ఎప్పుడో బంధం తెగిపోయిందని ఇక మీతో సోపతే వద్దు అని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. జయశంకర్ సార్ కలలుగన్న బీసీ రాజ్యం కోసం బీసీ జేఏసీ నడుము కట్టి ముందుకు వస్తున్నదన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని అన్ని స్థానాల్లో బీసీ జేఏసీ తరపున అభ్యర్థులు బరిలో ఉంటారని చెప్పారు. ఆదివారం నిజామాబాద్ లో నిర్వహించి బీసీ జేఏసీ సమావేశానికి హాజరైన మల్లన్న ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చరిత్రలో మొట్టమొదటి సారి బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలని రెడ్లు, వెలమలు ఢిల్లీకి వెళ్లి ధర్నా చేశారని నిజానికి ఆ ధర్నా వాళు చేయలేదని బీసీల చైతన్యమై వాళ్లతో ఆ ధర్నా చేయించిందన్నారు. ఇది బీసీల సత్తా అని అన్నారు.

## తెలంగాణ తెచ్చుకున్నదే నదీ జలాల కోసం



**న్యూస్ డెస్క్,17 ఆగష్టు (కెరటం న్యూస్):** తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ తెచ్చుకున్నదే నదీ జలాల కోసం....బీడు భూములను సాగులోకి తెచ్చుకోవడం కోసం... మా రాష్ట్రంలో ప్రాజెక్టులు పూర్తై., నీటి కేటాయింపులు జరిగిన తర్వాతే మిగులు జలాల అంశం తేల్చుకోవాలి. వరద జలాలపై ఇరు రాష్ట్రాల వాటా తేలిన తర్వాతే ప్రాజెక్టులు కట్టుకుంటే న్యాయ బద్ధంగా ఉంటుంది. నీటి వాటాలను తేల్చాల్సిన బాధ్యత కేంద్రానిది... రాజకీయ ప్రయోజనాల కంటే రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యం..ఇందిరాసాగర్, రాజీవ్ సాగర్, దేవాదుల వంటి గోదావరిపై మేం చేపట్టిన ప్రాజెక్టులు పూర్తి కాలేదు.. మా ప్రాజెక్టుల నిర్మాణం తర్వాత వాటాలు తేల్చి మిగిలిన వాటిని సమృద్ధి గా వాడుకోవచ్చు.

## ఆధారాలు ఇవ్వాలి లేదంటే క్షమాపణలు చెప్పాలి.. రాహుల్ గాంధీకి సీఈసీ అల్టిమేటం..!



**న్యూస్ డెస్క్,17 ఆగష్టు (కెరటం న్యూస్):** కాంగ్రెస్ నేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఎదురుదాడి చేశారు. రాహుల్ ఆరోపణలను తోసిపుచ్చారు. బిహార్ 'సర్' అంశంపై ఆదివారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు

## కాళేశ్వరంపై ఇంకో కుట్ర..

●మోటర్లు కావాలని ఆన్, ఆఫ్ చేస్తున్నారు - BHEL హెచ్చరికను లెక్కచేయని ప్రభుత్వం పై ఆగ్రహం ●కాళేశ్వరం నీళ్లు సముద్రంలోకి వదుల్తున్నారు – రైతుల పట్ల కాంగ్రెస్ నిర్లక్ష్యం ● రైతులు కాదు, రాజకీయాలే ముఖ్యం – ఉత్తమ్, రేవంత్ పై హరీష్ రావు ధ్వజం ● మేమే మోటర్లు ఆన్ చేస్తాం – నీటి విషయంలో ప్రభుత్వాన్ని గట్టిగా హెచ్చరించిన హరీష్



## మళ్లీ రిపీట్ అయితే చర్యలు తప్పవు..

### కోమటిరెడ్డి రాజగోపాల్‌కు మల్లు రవి హెచ్చరిక



**న్యూస్ డెస్క్,17 ఆగష్టు (కెరటం న్యూస్):** కాంగ్రెస్ సీనియర్ నేత, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి కి పీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి వార్నింగ్ ఇచ్చారు. ఆదివారం మల్లు రవి మీడియాతో మాట్లాడారు. రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తనతో మాట్లాడారని చెప్పారు. చాలా సేపు చర్చించినట్లు తెలిపారు. సమస్య రిపీట్ కాకుండా ఒకసారి చెప్పి చూస్తాం.. మళ్లీ రిపీట్ అయితే తప్పకుండా రాజగోపాల్ రెడ్డిపై చర్యలు తీసుకుంటామని మల్లు రవి వార్నింగ్ ఇచ్చారు. అనంతరం వరంగల్ పంచాయితీపై మల్లు రవి వివరణ ఇచ్చారు. వరంగల్‌కు నలుగురిని పంపించబోతున్నట్లు తెలిపారు. ఎవరెవరు వెళ్లాలి అనేది పార్టీ అధిష్టానం నిర్ణయిస్తుందని అన్నారు. తాను పార్టీలో మంటలు పెట్టడానికి లేను.. నా పని ఫైరింజన్ అని చెప్పారు. మంత్రి పదవి విషయంలో పదే పదే రాజ్ గోపాల్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేస్తున్నారు.

# 'మళ్లీ రిపీట్ అయితే చర్యలు తప్పవు'..

మొదటి పేజీ తరువాయి

ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యల్ని కమిటీ సీరియస్‌గా తీసుకుంది. ఇక మరోవైపు, ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొండా మురళి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై ఆ జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు ఆయన వైఖరిపై క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు చేశారు. దీనిపైనా క్రమశిక్షణ కమిటీ సమావేశంలో చర్చించారు.

## బీసీల కోసం రెడ్లు, వెలమలు ప్రాణాలిచ్చినా అభ్యంతరం లేదు: తీన్మార్ మల్లన్న

**న్యూస్ డెస్క్,17 ఆగష్టు (కెరటం న్యూస్):** బీసీలకు తెలంగాణలో ఉన్న రెడ్లు, వెలమలకు ఎప్పుడో బంధం తెగిపోయిందని ఇక మీతో సోపతే వద్దు అని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. జయశంకర్ సార్ కలలుగన్న బీసీ రాజ్యం కోసం బీసీ జేఏసీ నడుము కట్టి ముందుకు వస్తున్నదన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని అన్ని స్థానాల్లో బీసీ జేఏసీ తరఫున అభ్యర్థులు బరిలో ఉంటారని చెప్పారు. ఆదివారం నిజామాబాద్ లో నిర్వహించి బీసీ జేఏసీ సమావేశానికి హాజరైన మల్లన్న ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చరిత్రలో మొట్టమొదటి సారి బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలని రెడ్లు, వెలమలు ఢిల్లీకి వెళ్లి ధర్నా చేశారని నిజానికి ఆ ధర్నా వాళ్లు చేయలేదని బీసీల చైతన్యమై వాళ్లతో ఆ ధర్నా చేయించిందన్నారు. ఇది బీసీల సత్తా అని అన్నారు. గతంలో కేసీఆర్ అధికారంలోకి వచ్చేందుకు ఆ తర్వాత రెడ్లు అధికారంలోకి వచ్చేందుకు మా బడుగు బలహీన వర్గాల ప్రజల ప్రాణాలే పోయాయని ఇప్పుడు బీసీలు అధికారంలోకి రావడం కోసం రెడ్లు, వెలమలు ఆత్మబలిదానం చేసుకున్నా అంగీకరిస్తామని సంచలన వ్యాఖ్యలు చేశారు.

అడ్డుకుంటే బీజేపీకి ఉరితాడు: బీసీల రిజర్వేషన్ల విషయంలో బీజేపీ తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని ఇది భవిష్యతో బీజేపీకి ఉరితాడుగా మారుతుందని హెచ్చరించారు. కేసీఆర్ నోటి నుంచి ఇప్పటి వరకు బీసీ అనే పదం రాలేదని బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ లోని అగ్రవర్ణాలంతా ఒకతాను ముక్కలేనని విమర్శించారు. విష సర్పాలు ఒక పుట్ట నుంచి మరో పుట్టలోకి మారినంత మాత్రాన దాని విషయం పోదని అలాగే అగ్రవర్ణాల నాయకులు పార్టీ మారినంత బీసీలకు న్యాయం జరగదన్నారు. నిజామాబాద్ జిల్లా అగ్రవర్ణాల చెర నుంచి విముక్తి కావాలన్నారు. మా ఓట్లు మీకు వద్దు, మీ ఓట్లు మాకు వద్దన్నారు. గ్రామాల్లో 2028లో బీసీలే రాజ్యాధికారంలోకి వస్తారన్నారు. త్వరలోనే బీసీ రాజకీయ పార్టీ రాబోతున్నదని ఆ పార్టీతోనే అగ్రవర్ణ పార్టీలతో పోటీ పడబోతున్నామని చెప్పారు. కవితకు మాకు ఏం సంబంధం ఆమె వెలమ వ్యక్తి, కవిత బీసీ ఉద్యమాలు తన తండ్రి అధికారంలో ఉండగా చేయాల్సిందన్నారు.

## ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్




**న్యూస్ డెస్క్,17 ఆగష్టు (కెరటం న్యూస్):** అధికార ఎన్డీఏ కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ ఎంపికయ్యారు. ఈ మేరకు బీజేపీ పార్లమెంటరీ కమిటీ ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఎన్డీఏ కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిని ఖరారు చేసేందుకు ఆదివారం ఢిల్లీలోని కేంద్ర కార్యాలయంలో బీజేపీ పార్లమెంటరీ కమిటీ సమావేశమైంది.

ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పార్లమెంటరీ కమిటీ సభ్యులు ఈ సమావేశంలో పాల్గొని అభ్యర్థి ఎంపికపై చర్చించారు. అనంతరం ఎన్డీఏ కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్‌గా పని చేస్తోన్న సీపీ రాధాకృష్ణన్ పేరును ఫిక్స్ చేశారు. అనంతరం ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ పేరును బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అఫిషియల్‌గా ప్రకటించారు.

సీపీ రాధాకృష్ణన్ ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్‌గా పని చేస్తున్నారు. గతంలో ఈయన తెలంగాణ, జార్కండ్ గవర్నర్‌గా కూడా పని చేశారు. సీపీ రాధాకృష్ణన్ స్వస్థలం తమిళనాడు. 2026లో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలతో పాటు, సౌత్‌లో బీజేపీ బలోపేతమే లక్ష్యంగా బీజేపీ సీపీ రాధాకృష్ణన్ ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. తమిళనాడులో తమ ఉనికిని చాటు చాటుకుని దక్షిణాలో బలపడాలని కాషాయ పార్టీ ముమ్మర ప్రయత్నాలు చేస్తోన్న తరుణంలో సీపీ రాధాకృష్ణన్ ఎంపిక ఆ పార్టీకి కలిసి రానుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాతో ఉప రాష్ట్రపతి ఎన్నిక వచ్చిన విషయం తెలిసిందే. ఉప రాష్ట్రపతి ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే షెడ్యూల్ విడుదల చేసింది. 2025, సెప్టెంబర్ 9న వైస్ ప్రెసిడెంట్ ఎలక్షన్ ఎన్నిక జరగనుంది. ఉభయ సభల్లో ఎన్డీఏ కూటమికి కావాల్సిన బలం ఉండటంతో ఉప రాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ ఎన్నిక లాంఛనం కానుంది. సంఖ్యా బలం లేని కారణంగా ప్రతిపక్ష ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిని బరిలోకి దించుతుందో లేదో చూడాలి.

## ఆధారాలు ఇవ్వాలి లేదంటే క్షమాపణలు చెప్పాలి.. రాహుల్ గాంధీకి సీఈసీ అల్టిమేటం..!

**న్యూస్ డెస్క్,17 ఆగష్టు (కెరటం న్యూస్):** కాంగ్రెస్ నేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఎదురుదాడి చేశారు. రాహుల్ ఆరోపణలను తోసిపుచ్చారు. బిహార్ 'సర్' అంశంపై ఆదివారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్‌కు సంబంధించిన గణాంకాలు లేని పీపీటీని చూపించినంత మాత్రాన అబద్ధం నిజం కాదని.. ఆధారాలు అందించాల్సి ఉంటుందన్నారు. రాహుల్‌పై ఎదురుదాడి చేస్తూ అఫిడవిట్ ఇవ్వాలని.. లేదంటే దేశానికి క్షమాపణలు చెప్పాలని.. ఇందులో మూడో మార్గం లేదని హెచ్చరించారు. ఏడురోజుల్లో అఫిడవిట్ ఇవ్వకపోతే ఆరోపణలు నిరాధారంగా పరిగణిస్తామన్నారు. బిహార్ 'సర్' అంశంపై కొందరు తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల సంఘం తన పని తాను చేసుకుంటుందని.. ప్రతి ఎన్నికలకు ముందు ఓటరు జాబితా సరి చేయాలని ప్రజాప్రాతినిధ్య చట్టం చెబుతోందని.. ఇది ఎన్నికల కమిషన్ చట్టపరమైన బాధ్యత అన్నారు. సర్ అంశానికి సంబంధించి పని జూన్ 24న ప్రారంభమై.. జులై 20 నాటికి దాదాపు పూర్తయ్యిందని తెలిపారు. ఈ సందర్భంగా రెండు ఎపిక్ కార్డులు ఉన్న ఓటరు కార్డుల అంశంపై సీఈసీ జ్ఞానేశ్ కుమార్ మాట్లాడుతూ.. డూప్లికేట్ ఎపిక్ రెండు విధాలుగా ఉండవచ్చని.. ఒకటి పశ్చిమ బెంగాల్ ఉన్న వ్యక్తికి.. వేరే వ్యక్తికి ఒక ఎపిక్ నెంబర్ ఉంటుందని.. హర్యానాలో ఉన్న మరొక వ్యక్తికి ఒకే ఎపిక్ నెంబర్ ఉంటుందన్నారు. దీనిపై ప్రశ్న మార్చి 2025 సమయంలోనే వచ్చినా దాని చర్చించి.. దేశవ్యాప్తంగా సమస్యను పరిష్కరించామన్నారు. ఎపిక్ నంబర్లు ఒకేలా ఉన్న దాదాపు మూడు లక్షల మంది వ్యక్తులను గుర్తించారని.. కాబట్టి వారి ఎపిక్ నంబర్లు మార్చినట్లు పేర్కొన్నారు. ఒకే వ్యక్తి పేరు ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటరు జాబితాలో ఉంటే.. అతని ఎపిక్ నంబర్ భిన్నంగా ఉన్నప్పుడు మాత్రమే జరుగుతుందన్నారు. ఒక వ్యక్తి అనేక ఎపిక్‌లు.. 2003కి ముందు ఎన్నికల కమిషన్ వద్ద డేటా ఒకేచోట ఉండే వెబ్‌సైట్ లేదని చెప్పారు. 2003 కి ముందు సాంకేతికంగా సౌకర్యం అందుబాటులో లేనందున.. వేర్వేరు ప్రదేశాలకు వెళ్లిన చాలా మంది వ్యక్తుల పేర్లను ఆయా ప్రాంతాల్లో జాబితాలో చేర్చారని.. అప్పుడు ప్రశ్నలు వచ్చాయని.. నేడు వెబ్‌సైట్ అందుబాటులో ఉందని.. దాన్ని తొలగించవచ్చన్నారు.



# విజన్ లేని సీఎం వల్ల ప్రజాధనం వృథా

మొదటి పేజీ తరువాయి

ఈ చట్టాన్ని ఉటంకిస్తూ, తాను రెండేళ్ల క్రితమే అసెంబ్లీలో ఈ విషయం పై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించానని గుర్తుచేశారు. అయినా, రేవంత్ ప్రభుత్వం వందల కోట్ల రూపాయలు పీఆర్ కోసం ఖర్చు చేసి, ఇప్పుడు తీవ్రమైన న్యాయపరమైన అడ్డంకులను ఎదుర్కొంటోందని, చివరికి అధికారులు కూడా దీనిని అంగీకరిస్తున్నారని అన్నారు.

ఫార్మా సిటీ కోసం 20 వేల ఎకరాలు భూములు..

బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో 56 గ్రామాల పరిధిలో హైదరాబాద్ ఫార్మసిటీ కోసం 20 వేల ఎకరాలతో ప్రతిపాదనలను తయారు చేసింది, స్థానిక రైతులు రాష్ట్ర ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి వచ్చి తమ భూములను హైదరాబాద్ ఫార్మాసిటీ కోసం ఇచ్చారని కేటీఆర్ తెలిపారు. అయితే కొంతమంది తమ భూములు ఇవ్వడం పై అభ్యంతరాలు వ్యక్తం చేస్తే కాంగ్రెస్ పార్టీ మాత్రం అధికారంలోకి రాగానే హైదరాబాద్ ఫార్మాసిటీ కోసం సేకరించిన ప్రతి ఎకరాన్ని తిరిగి రైతన్నలకు ఇస్తామని హామీలు ఇచ్చి, ఇప్పుడు రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు స్నేహితుల కోసం అవే భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ వారిని నిండా మోసం చేసిందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

రైతన్నలు ఫార్మా కంపెనీల కోసం కేటాయించిన భూముల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఫార్మా సిటీ ప్రాజెక్టు కోసం గత ప్రభుత్వం కోట్లాది రూపాయల ప్రజాధనంతో మౌలిక వసతుల కల్పనను ప్రారంభించిన, రేవంత్ రెడ్డి ప్రభుత్వం దానిని పక్కన పెట్టి, ఇప్పుడు ఫ్యూచర్ సిటీ పేరుతో భూములను అక్రమంగా రియల్ ఎస్టేట్ కు మళ్లించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ చర్యలు ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నాయని, దీని వల్ల ప్రజలు, ముఖ్యంగా రైతులు నష్టపోతారని కేటీఆర్ హెచ్చరించారు. ఈ మొత్తం వ్యవహారంపై ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజలకు, రైతులకు స్పష్టత ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో, బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు.

# కాళేశ్వరంపై ఇంకో కుట్ర..

**న్యూస్ డెస్క్,17 ఆగష్టు (కెరటం న్యూస్):** సాగునీటిపై హరీష్ రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పై మరో కుట్రపన్నుతున్నారని మండిపడ్డారు. హరీష్ రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తన రాజకీయాల కోసం రైతుల మీద పగ ప్రతికారాలు తీర్చుకుంటుంది.. కాళేశ్వరం ప్రాజెక్టుకు వచ్చిన వరదను సముద్రంలోకి వదులుతుంది.. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి లక్షల క్యూసెక్కుల వరద దిగువకు విడుదల చేస్తుంది.. నంది మేడారం పంప్ హౌస్ నుంచి మానేరుకు నీరు విడుదల చేసే అవకాశం ఉన్న చేయట్లేదు.. వారం రోజుల కిందట ఇదే అంశంపై ఉత్తమ్ కుమార్ రెడ్డికి లేఖ రాశాను.. మోటర్లు ఆన్ చేయమంటే పట్టించుకోలేదు..

ఉత్తమ్ కుమార్ రెడ్డికి, సీఎం రేవంత్ కి నీళ్ల విలువ తెలియదు.. మీరు వ్యవసాయం చేయలేదు కాబట్టి మీకు నీటి విలువ తెలియదు.. నేరపూరిత నిర్లక్ష్యం వల్ల వర్షాలు వస్తున్నా చెరువులు, డ్యామ్ లు నింపటం లేదు..బిఆర్ఎస్ పార్టీ, కేసీఆర్, హరీష్ రావుపై ఉన్న కోపం రైతులపై చూపించవద్దు.. మీ బురద రాజకీయాల కోసం వరద నీటిని కిందికి వదలొద్దు.. కాళేశ్వరం ప్రాజెక్టు పై బిఆర్ఎస్ పై నిందలు మోపడనికే ఇలా చేస్తుంది.. కాళేశ్వరం కూలింది అన్న విషయాన్ని నమ్మించడానికి ఇలా చేస్తున్నారు.. మళ్ళీ కాళేశ్వరం నుంచి నీరు పంపింగ్ చేస్తే కాంగ్రెస్ గోబెల్స్ ప్రచారం బయటపడుతుందని దుర్మార్గం చేస్తుంది.. ప్రభుత్వం నడపడం మీకు చేతకావడం లేదా? అని ప్రశ్నించారు.


కాళేశ్వరం కింద ఉన్న రిజర్వాయర్లు అన్ని నింపితే పంటలు పండుతాయి కదా.. రోజుకు 2 టీఎంసీ ల నీరు మిడ్ మానేరుకు పంపింగ్ చేయొచ్చు.. 7 మోటర్ల నుంచి నీళ్లు పంపింగ్ చేసే అవకాశం ఉన్న 3 మోటర్లు మాత్రమే పంపింగ్ చేస్తున్నారు.. అన్నపూర్ణ, రంగనాయక, కొండపోచమ్మ సాగర్ కాళేశ్వరం నీళ్ళతో నిండేవి.. రైతులకు యూరియా ఇవ్వక, ప్రాజెక్టులు నింపక అరిగోస పెడుతున్నారు.. రోజుకు ప్రాజెక్టుల్లో 42 లక్షల మిలియన్ యూనిట్ల కరెంట్ ఉత్పత్తి అవుతుంది.. మీరు కాళేశ్వరం మోటర్లు ఆన్ చేయకపోతే మేము లక్షలాది మంది రైతులతో వెళ్లి మోటర్లు ఆన్ చేస్తాం.. నీళ్లను సముద్రం పాలు చేస్తామంటే మేము చూస్తూ ఉరుకోము.. మీరు రైతు వ్యతిరేక ప్రభుత్వం అని తేలిపోయింది..

కాళేశ్వరం పై ఇంకొక కుట్ర జరుగుతుంది.. మోటర్లను కావాలని ఆన్, ఆఫ్ చేస్తున్నారు.. రోజు ఇలా చేస్తే మోటర్లు పాడవుతాయని %దీఎజూ% హెచ్చరించింది.. అయినా కావాలనే ఇలా కుట్రలు చేస్తున్నారు.. ఉత్తమ్, సీఎం మధ్య విభేదాలు ఉంటే మీరు మీరు చూసుకోండి.. కానీ మోటర్లు ఆన్ చేయకపోతే పెద్ద ఎత్తున వెళ్లి మోటర్లు ఆన్ చేస్తాం.. నల్గొండలో మాధవరెడ్డి ప్రాజెక్టుపై కూడా ఇలానే చేస్తున్నారు.. 18 ఏళ్ల తర్వాత కృష్ణా నదిలో నీళ్లు వచ్చాయి.. అయినా ఇప్పటివరకు ఏ ఒక్క చెరువు కూడా నింపలేదు.. కల్వకుర్తి ప్రాజెక్టులో మూడు మోటర్లతో పంపింగ్ చేయాల్సి ఉంటే ఒకటే మోటార్ ఆన్ చేశారు.. వరంగల్ జిల్లాలో దేవాదుల విషయంలోనూ ఇలానే చేస్తున్నారు.. కమీషన్లు, పర్సెంటేజీల కోసమే మీకు సమయం సరిపోతుందా అని మండిపడ్డారు.

## నిర్మాణ రంగంలో స్వదేశీ వస్తువులనే వాడాలి : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**న్యూస్ డెస్క్,17 ఆగష్టు (కెరటం న్యూస్):** నగరంలో నిర్మాణ రంగం ఊపందుకుంటుందని, వినియోగదారుల ప్రయోజనాల మేరకు నిర్మాణరంగ సంస్థలు పనిచేయాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. హైటెక్స్‌లో నిర్వహించిన క్రెడాయ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా వస్తోన్న మార్పుల దృష్ట్యా బిల్డర్స్ స్వదేశీ వస్తువులనే ఉపయోగించాలని సూచించారు. నిర్మాణ రంగానికి ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. నిర్మాణ రంగ వ్యాపారులు ఇళ్ల నిర్మాణం నాణ్యతలో రాజీ పడొద్దన్నారు. "ఇప్పటికే హైదరాబాద్.. ఐటీ, ఫార్మా రంగాల్లో దూసుకెళ్తోంది. నిర్మాణం రంగంలోనూ దూసుకుపోతోంది. అంతర్జాతీయ విమానాశ్రయాలు, జాతీయ రహదారులు మౌలిక వసతుల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందజేస్తోంది. వరంగల్‌లో విమానాశ్రయం రాబోతోంది. ఆదిలాబాద్‌లోని డిఫెన్స్ ఎయిర్‌పోర్టును ప్రజా ఎయిర్‌పోర్టుగా మారుస్తున్నాం. ఎంఎంటీఎస్ రైళ్లను ఏసీ రైళ్లుగా మారుస్తాం. సాంకేతిక కారణాలతో మెట్రో పెండింగ్‌లో ఉంది. దాన్ని త్వరలోనే పూర్తి చేస్తాం. సికింద్రాబాద్‌లో రూ.720 కోట్లతో రైల్వే పనులు చేస్తున్నాం. హైదరాబాద్–విజయవాడ గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే పూర్తి చేస్తాం"అని కిషన్‌రెడ్డి తెలిపారు

## హక్కులను అడగడంలో తప్పులేదు.. సాధించకపోతేనే తప్పు: మంత్రి పొన్నం ప్రభాకర్



**న్యూస్ డెస్క్,17 ఆగష్టు (కెరటం న్యూస్):** స్వాతంత్ర్యం వచ్చి ఇన్నాళ్లయినా కూడా సామాజిక న్యాయంపై చర్చ జరుగుతోందని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రవీంద్ర భారతిలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సమాఖ్య అధ్యక్షుడు మహేశ్వర్ రాజ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. 'ఎవరెంతో వారికంత న్యాయం జరగాలి' అని రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారని తెలిపారు. ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగేలా రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడే పరిస్థితి వచ్చిందన్నారు. "ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు ఆయుధం. అలాంటి ఓట్లను తొలగించి దుర్భర పరిస్థితులు ఏర్పడేలా చేస్తున్నారు. ఈ పోటీ ప్రపంచంలో మన వర్గాలు విజయం సాధించాలి. మన బాధ్యతగా మార్గదర్శకత్వాన్ని రాబోయే తరాలకు అందించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం బలహీన వర్గాలు.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు న్యాయం జరిగేలా అన్ని కార్యక్రమాలు చేపడుతోంది. మన హక్కుల కోసం అడగడంలో తప్పులేదు. మన హక్కులు సాధించుకోలేకపోతేనే తప్పు. రాబోయే కాలంలో పోటీ ప్రపంచంలో మన వర్గాలు ముందుండాలి"అని మంత్రి పొన్నం అన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి వివేక్ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల కలయికే ఇండియా.. మనం లేకుంటే దేశమే లేదు: టీపీసీసీ చీఫ్

**న్యూస్ డెస్క్,17 ఆగష్టు (కెరటం న్యూస్):** ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల కలయికే భారత దేశమని.. మనం లేకుంటే అసలు దేశమే లేదని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీస్ సమైక్య ఆధ్వర్యంలో నేషనల్ కన్వెన్షన్ అండ్ ఫెలిస్టేషన్ కార్యక్రమం నిర్వహించారు. టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. దేశాన్ని ఏలుతున్న వారు మతాల పేరుతో విభజన రాజకీయాలు చేస్తున్నారని బీజేపీపై ఫైర్ అయ్యారు.

మనమంతా ఐక్యంగా ఉంటేనే రాజ్యాంగాన్ని కాపాడుకోగలమన్నారు. మహారాష్ట్రలో బీజేపీ గెలవడానికి మోడీ ఓట్ చోరీ చేశాడని ఆరోపించారు. దేశంలో కార్పొరేట్ శక్తులను పెంచి పోషించడానికే బీజేపీ పార్టీ పనిచేస్తుందని విమర్శించారు. మత వాద శక్తులను అడ్డుకోవాలని.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఐక్యంగా ఉంటేనే దేశం సురక్షితంగా ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు రాహుల్ గాంధీ వెంట నిలబడాలని పిలుపునిచ్చారు.

## వాళ్ళ వల్ల బీజేపీకి చాలా నష్టం జరుగుతోంది

మొదటి పేజీ తరువాయి

కాగా, తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవిని మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావుకు అప్పగించడాన్ని నిరసిస్తూ నిరసనగా రాజాసింగ్ బీజేపీకి గుడ్ బై చెప్పిన విషయం తెలిసిందే. వెంటనే ఆయన రాజీనామాను అధిష్టానం కూడా ఆమోదించింది. ఈ వ్యవహారం కమలం పార్టీలో కల్లోలానికి దారితీసింది. దాంతో తరచూ ఆయన పార్టీలో కష్టపడే వారికి న్యాయం జరగడం లేదని, తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం కొంత మంది బీజేపీ నేతలకే ఇష్టం లేదంటూ రాజాసింగ్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తూ వస్తున్నారు. తాజాగా చేసిన వ్యాఖ్యలపై అధిష్టానం ఏ విధంగా స్పందిస్తుందో చూడాలి.

## తెలంగాణ తెచ్చుకున్నదే నదీ జలాల కోసం

**న్యూస్ డెస్క్,17 ఆగష్టు (కెరటం న్యూస్):** తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ తెచ్చుకున్నదే నదీ జలాల కోసం....బీడు భూములను సాగులోకి తెచ్చుకోవడం కోసం... మా రాష్ట్రంలో ప్రాజెక్టులు పూర్తై., నీటి కేటాయింపులు జరిగిన తర్వాతే మిగులు జలాల అంశం తేల్చుకోవాలి. వరద జలాలపై ఇరు రాష్ట్రాల వాటా తేలిన తర్వాతే ప్రాజెక్టులు కట్టుకుంటే న్యాయ బద్ధంగా ఉంటుంది. నీటి వాటాలను తేల్చాల్సిన బాధ్యత కేంద్రానిది... రాజకీయ ప్రయోజనాల కంటే రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యం..ఇందిరాసాగర్, రాజీవ్ సాగర్, దేవాదులు వంటి గోదావరిపై మేం చేపట్టిన ప్రాజెక్టులు పూర్తి కాలేదు.. మా ప్రాజెక్టుల నిర్మాణం తర్వాత వాటాలు తేల్చి మిగిలిన వాటిని సమృద్ధి గా వాడుకోవచ్చు. మా అవసరాలు తీరకుండా దిగువ ప్రాజెక్టులు నిర్మాణం జరిగితే ఆ తర్వాత కేటాయింపుల సమస్యలు ఎక్కువవుతాయి.. సముద్రంలోకి వెళ్ళే జలాల అని మాట్లాడటం అర్థం చేసుకోలేని అమాయకులు ఎవరు లేరు.. తెలంగాణలో కాంగ్రెస్ పటిష్టంగా ఉంది...అసంతృప్తి అనేది కొందరు ప్రచారం చేస్తున్నారు.. చంద్రబాబు, రేవంత్, రాహుల్ హాట్ లైన్ పై జగన్ వ్యాఖ్యలు వ్యక్తిగతమైన రాజకీయ ఆరోపణ... రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా పార్టీ విధానాలు విశాలమైన ప్రయోజనాలతో ఉంటాయి తప్ప సంకుచితమైన మనస్తత్వంతో ఉండవు.. అని తెలిపారు.

# ఇదెక్కడి దిక్కుమాలిన ఆలోచన..



**న్యూస్ డెస్క్,17 ఆగష్టు (కెరటం న్యూస్):** ఓట్లు, అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ దేశభద్రతనే పణంగా పెట్టడం మంచి పద్ధతి కాదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. ఇలాంటి చవకబారు ఆరోపణలు సరికాదని విపక్షాలను దుయ్యబట్టారు. ఎన్నికల కమిషన్ స్వతంత్ర సంస్థ అని సుప్రీంకోర్టు కూడా కొన్ని ఆదేశాలు జారీ చేసిందన్నారు. దాని ప్రకారం నిర్ణయాలు ఉంటాయి తప్ప దానికి పార్టీకి, ప్రభుత్వానికి ఏం సంబంధం ఉంటుంది.. ఆ మాత్రం అవగాహన లేకపోతే ఎలా? అని నిలదీశారు. ఇవాళ కరీంనగర్ లో పర్యటించిన ఆయన ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఓట్ చోరీ , స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలపై స్పందించారు.

మీరు గెలిస్తే పని చేసినట్లా?:

తెలంగాణ, కర్ణాటకలో గెలిచింది కాంగ్రెస్ పార్టీనే గెలిచిందని, ఇక్కడ కూడా ఈవీఎంలతోనే ఎన్నికలు జరిగాయి కదా అని ఈటల ప్రశ్నించారు. మీరు గెలిస్తే మెషన్లు, ఈసీ మంచిగా పని చేసినట్లు, ఓడిపోతే ఎలక్షన్ కమిషన్ పనిచేయనట్లు, ఓట్ల చోరీ జరిగినట్లు దుష్ప్రచారం చేస్తున్నారు ఇదెక్కడి దిక్కుమాలిన ఆలోచన అని మండిపడ్డారు. హైదరాబాదులో అద్దెకు ఉండేవాళ్లు ఒక ప్రాంతం నుంచి ఇంకో ప్రాంతానికి మారుతూ ఉంటారని వీరి ఓట్లను సరి చేయాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్ మీద ఉంటుంది కదా అని ప్రశ్నించారు. ఓట్ల నమోదు, డబుల్ ఓట్లను తొలగించే విధానం నిరంతర ప్రక్రియ అన్నారు. బీహార్ బార్డర్ ఉన్న ప్రాంతం అని ఇక్కడికి బంగ్లాదేశ్ ఇతర ప్రాంతాల నుండి వచ్చే అవకాశం ఉందన్నారు. అలా వచ్చిన వారికి ఆధార్ కార్డులు సిటిజన్ షిప్ ఇవ్వడం ఎంత మాత్రం దేశానికి క్షేమం కాదన్నారు.

## శాంతి చర్చలకు మేం రెడీ ఉక్రెయిన్ ప్రెసిడెంట్ జెలెన్ స్కీ



**న్యూస్ డెస్క్,17 ఆగష్టు (కెరటం న్యూస్):** రష్యాతో యుద్ధాన్ని ఆపేందుకు, ఇరు దేశాల మధ్య శాంతి నెలకొల్పేందుకు ఉక్రెయిన్ శాయశక్తులా కృషి చేస్తుందని ఆ దేశ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్ స్కీ పేర్కొన్నారు. శాంతి చర్చలకు తాము సిద్ధమని ప్రకటించారు. ఈమేరకు అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ తో ఫోన్ కాల్ తర్వాత జెలెన్ స్కీ ఈ ప్రకటన చేశారు.

రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ కోసం ట్రంప్ చర్చలు జరుపుతుండగా.. ఏకంగా శాంతి నెలకొల్పడమే లక్ష్యంగా చర్చించాలని పుతిన్ కోరారు. ఈ ప్రతిపాదనను ట్రంప్ ఉక్రెయిన్ ప్రెసిడెంట్ ముందుంచగా.. జెలెన్ స్కీ కూడా అంగీకరించారు. ఈ విషయంపై చర్చించేందుకు అమెరికా రావాలని ట్రంప్ తనను ఆహ్వానించినట్లు జెలెన్ స్కీ తెలిపారు. దీంతో సోమవారం తాను వాషింగ్టన్ బయలుదేరి వెళుతున్నానని పేర్కొన్నారు.

కాల్పుల విరమణ కానీ, శాంతి నెలకొల్పే ప్రక్రియ కానీ ఉక్రెయిన్ తరఫు నుంచి నిర్మాణాత్మక సహకారం తప్పకుండా అందిస్తామని ఆయన చెప్పారు. ఇందుకోసం రష్యా, అమెరికా, ఉక్రెయిన్ ప్రెసిడెంట్లు ఉమ్మడిగా (త్రైపాక్షిక) సమావేశం కావాలంటూ ట్రంప్ చేసిన ప్రతిపాదననూ జెలెన్ స్కీ స్వాగతించారు.

అదే సమయంలో పీస్ డీల్ చర్చల్లో ప్రతీ దశలోనూ అమెరికాతో పాటు యురోపియన్ యూనియన్ దేశాల లీడర్లు కూడా పాల్గొనాలని కోరారు. నేతలందరి సమక్షంలో జరిగే ఒప్పందాలకు, సెక్యూరిటీకి మరింత విశ్వసనీయత కలుగుతుందని అభిప్రాయపడ్డారు. కాగా, అలస్కాలో పుతిన్ తో భేటీ పూర్తయ్యాక వాషింగ్టన్ తిరిగి వెళుతూ జెలెన్ స్కీతో పాటు పలువురు నాటో లీడర్లతో ట్రంప్? ఫోన్ లో మాట్లాడారని అధికారవర్గాలు తెలిపాయి.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎంపీ నామ



**ఖమ్మం బ్యూరో,17 ఆగష్టు (కెరటం న్యూస్):** బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఆదివారం ఖమ్మం కార్పొరేషన్, బోనకల్ రోడ్‌లోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన వివాహ వేడుకకు హాజరయ్యారు. ఖమ్మం లెనిన్‌నగర్‌కు చెందిన బొడ్లపాటి నాగేశ్వరరావు-కరుణ దంపతుల కుమారుడు సాయి చరణ్ వివాహం, హైదరాబాద్ వాస్తవ్యులు దాములూరి కృష్ణారావు-నాగేంద్రమణి దంపతుల కుమార్తె వైష్ణవితో వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా నామ నూతన వధూవరులను ఆశీర్వదించి, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, పిల్లల పాపలతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. నామ వెంట కనకమేడల సత్యనారాయణ, గొడ్డేటి మాధవరావు, మోరంపూడి ప్రసాద్ రావు, మారెడ్డి వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

## గృహ ప్రవేశ వేడుకలో పాల్గొన్న మాజీ ఎంపీ నామ



**ఖమ్మం బ్యూరో,17 ఆగష్టు (కెరటం న్యూస్):** ఖమ్మం కార్పొరేషన్, శ్రీ సత్య సాయి నగర్ వాస్తవ్యులు డాక్టర్ కుసుమరాజు రవి కుమార్, మాలతి దంపతుల నూతన గృహ ప్రవేశం వేడుక తో పాటుగా వారి కుమార్తెలు శ్రీ లక్ష్మీ సాయి ప్రణీత, శ్రీ కృతి ఓణీల అలంకరణ కార్యక్రమం కూడా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు హాజరై దంపతులకు అభినందనలు తెలిపి నూతన గృహ ప్రవేశం చేసుకున్న రవి కుమార్, మాలతి దంపతులు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో సిరిసంపదలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. వారి కుమార్తెల శ్రీ లక్ష్మీ సాయి ప్రణీత, శ్రీ కృతి లకు ఆశీర్వాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో కనకమేడల సత్యనారాయణ, గొడ్డేటి మాధవరావు, మోరంపూడి ప్రసాదరావు, రేగళ్ల కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

## సంపూర్ణ ఆరోగ్యానికి యోగ అవసరం



**ఖమ్మం టౌన్,17 ఆగష్టు (కెరటం న్యూస్):** ఖమ్మం యోగ, ధ్యాన సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆరోగ్య అవగాహన సదస్సుకు యోగ టీచర్ వరలక్ష్మి స్వాగతం పలకగా వంజాకు లక్ష్మీనారాయణ రావ్ అడ్వకేట్ అధ్యక్షత వహించారు. ప్రముఖ నేచురపతి డాక్టర్ సింధుజ ఉరిమెళ్ళ మాట్లాడుతూ జబ్బు రాకుండా మనం ఏ విధమైన ఆహార ఆహార పదార్థాలు ఎప్పుడు ఎలా ఎందుకు అనే నియమాలతో రోగ నిరోధక శక్తిని పెంచుకుంటూ మన ఆహారంలో చిన్న చిన్న మార్పులు తీసుకొని ఆరోగ్యంగా జీవించవచ్చని అన్నారు. ఆరోగ్యంగా జీవించడానికి పలు విధాలైన వైద్య విధానాలైన నేచురపతి, ఆక్యు ప్రెషర్, మ్యాగ్నెట్ థెరపీ, మడ్ బాత్, స్టీమ్ బాత్, సవివరముగా సబికులను ఆకట్టుకునేట్టుగా చెప్పారు. మరొక వక్త ఎండి ఆశ టీచర్ గారు ప్రసంగిస్తూ అయ్యంగారి యోగ థెరపీ విధానాలు, మన వంటిల్లే వైద్యశాలని అమ్మే డాక్టర్ అని చెప్పారు. పంచ కోశాల గురించి, బాడీలో చక్రాలు ఏ విధంగా పనిచేస్తాయో డెమో ద్వారా వివరించారు. పీబి శ్రీరాములు అడ్వకేట్, శ్రియస్ పాలి క్లినిక్ నిర్వాహకులు స్వప్న వివిధ యోగా సెంటర్స్ నిర్వాహకులు టీచర్లు హాజరైనారు. ఈ కార్యక్రమానికి కన్వీనర్ వంజాకు లక్ష్మీనారాయణ రావు అడ్వకేట్ అధ్యక్షత వహించారు. కో- కన్వీనర్ కాసిన ఆనంద ప్రసాద్ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో యోగా సెంటర్స్ గురువులు నాగేశ్వరరావు, కోదండరాం, సీతారాములు, రమేష్, వెంకట రాములు, స్వరూప, డాక్టర్ సురేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారి లక్ష్మీప్రణీతకు ఎంపీ వద్దిరాజు ఆశీస్సులు



**హైదరాబాద్ బ్యూరో,17 ఆగష్టు (కెరటం న్యూస్):** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర చిన్నారి లక్ష్మీప్రణీతకు తన ఆశీస్సులు అందజేశారు.శెట్టిపల్లి వెంకటేశ్వర రావు మనుమరాలు డాక్టర్ కుసుమరాజు రవికుమార్-మాలతి దంపతుల జ్యేష్ఠ పుత్రిక లక్ష్మీప్రణీత నూతన పట్టు వస్త్రాలంకరణ,ఖమ్మం సత్యసాయి నగర్ రోడ్డు నంబర్ 8లో నిర్మించిన నూతన గృహ ప్రవేశం వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర, డాక్టర్ శెట్టిపల్లి నాగేశ్వరరావు,శీలంశెట్టి వీరభద్రం,రేగళ్ల కృష్ణప్రసాద్ తదితర ప్రముఖులు హాజరై అక్షింతలు వేసి లక్ష్మీప్రణీతను ఆశీర్వదించారు. ఆమె తల్లిదండ్రులు డాక్టర్ రవికుమార్-మాలతి, తాతలు వెంకటేశ్వర రావు, నాగేశ్వరరావు, వారి కుటుంబ సభ్యులకు ఎంపీ వద్దిరాజు పుష్పగుచ్ఛమిచ్చి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు

## నూతన వధూవరులకు ఎంపీ వద్దిరాజు ఆశీస్సులు



**హైదరాబాద్ బ్యూరో,17 ఆగష్టు (కెరటం న్యూస్):** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర నూతన వధూవరులు శివకార్తీక్ -లక్ష్మీ శిరీషలను ఆశీర్వదించారు. కర్రి నాగేశ్వరరావు-వెంకటలక్ష్మీ దంపతుల కుమారుడు శివకార్తీక్ పెళ్లి లక్ష్మీశిరీషతో ఖమ్మంలోని వాసిరెడ్డి ఫంక్షన్ హాలులో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శీలంశెట్టి వీరభద్రం, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి వల్లాల ప్రసాదరావు తదితర ప్రముఖులతో కలిసి అక్షింతలు వేసి నూతన వధూవరులు శివకార్తీక్-లక్ష్మీశిరీషలకు ఆశీస్సులు అందజేశారు.వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు ఎంపీ వద్దిరాజు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## నవ దంపతులకు ఎంపీ వద్దిరాజు ఆశీస్సులు



**ఖమ్మం బ్యూరో,17 ఆగష్టు (కెరటం న్యూస్):** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర నూతన వధూవరులు శ్రీకర్-నిఖితలను ఆశీర్వదించారు.ప్రముఖ వ్యాపారవేత్త వేములపల్లి శ్రీనివాసరావు - జయలక్ష్మీ దంపతుల కుమార్తె నిఖిత పెళ్లి ఆంధ్రప్రదేశ్ గుంటూరు నగర వాస్తవ్యులు నంబూరి శివ నాగేశ్వరరావు-సునీత దంపతుల జ్యేష్ఠ కుమారుడు శ్రీకర్ తో ఖమ్మం వెంకటగిరి క్రాస్ రోడ్స్ లోని శ్రీహర్ష కన్వెన్షన్ హాలులో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ పెళ్లికి ఎంపీ రవిచంద్ర హాజరై నూతన వధూవరులు శ్రీకర్-నిఖితలకు పుష్పగుచ్ఛమిచ్చి, అక్షింతలు వేసి తన ఆశీస్సులు అందజేశారు.నూతన వధూవరుల తల్లితండ్రులు శ్రీనివాసరావు-జయలక్ష్మీ, శివ నాగేశ్వరరావు-సునీత, సంకా గంగాధర్-లక్ష్మీ, వేములపల్లి వెంకటేశ్వర రావు- సామ్రాజ్యలక్ష్మీ, వేములపల్లి నరేష్ -ప్రమోదిని, వేములపల్లి నగేష్-శిరీష, వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు ఎంపీ వద్దిరాజు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## 1,11,12,876 విలువ గల కళ్యాణ లక్ష్మి, షాది ముభారక్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఎం ఎస్ రాజ్ ఠాకూర్



**రామగుండం, 17 ఆగష్టు (కెరటం న్యూస్):** ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రామగుండం కార్పొరేషన్ కు చెందిన 111మంది కళ్యాణ లక్ష్మి మరియు షాది ముభారఖ్ లబ్ధిదారులకు రూ.1,11,12,876 - విలువ గల చెక్కులను స్థానిక నాయకులతో మరియు అధికారులతో కలిసి పంపిణీ చేశారు ఎక్కడ కూడా పేద కుటుంబం లేకుండా చేయడమే నా లక్ష్యం అంతర్గం మండలంలో రెండు కోట్లతో మరియు పాలకుర్తి మండలం లో రెండు కోట్లతో మహిళ భవన్ ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేస్తాం రామగుండం శాసనసభ్యులు ఎం ఎస్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ ఈ నగరానికి అభివృద్ధి చేయాలి అనే ఆలోచనతో ముందుకు వెళుతున్న ప్రతి నిరుపేద కుటుంబాలకు గుర్తించి తెలంగాణ ప్రజా ప్రభుత్వం రేవంత్ రెడ్డి ఇస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి నిరుపేద కుటుంబానికి అందే విధంగా చేస్తున్నాం ప్రజా ప్రభుత్వంలో ప్రతి గల్లీలో రోడ్లు మరియు డ్రైనేజీ లైటింగ్ పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసుకుంటూ ముందుకు వెళ్తున్నాం జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతి ఒక్కరు కూడా సహకరించాలనీ కోరారు రామగుండంలో 1800 విద్యుత్ పవర్ ప్లాంట్ తీసుకో వస్తున్నాం అదేవిధంగా సింగరేణి 25 కోట్లతో నిధులతో సింగర్ అనే క్వార్టర్స్ ఏరియాలో రూట్స్ మరియు డ్రైనేజి వేస్తున్నాం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఐటీ శాఖ మంత్రి బుద్దుల శ్రీధర్ బాబు సహకారంతో రామగుండం నియోజకవర్గం అభివృద్ధి ఈ రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉండే విధంగా చేస్తాను. ఈ కార్యక్రమంలో అధికారులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ కార్పొరేటర్లు వివిధ విభాగాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు

## నాయక పోడు కులానికి తీరని అన్యాయం

### జయశంకర్ భూపాలపల్లి జిల్లా నాయక పోడు ఉద్యోగ సంఘాల అధ్యక్ష కార్యదర్శులు



**కాటారం,17 ఆగష్టు (కెరటం న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఆదివాసి నాయకపోడ్ ఉద్యోగుల సంఘం భూపాల్ పల్లి జిల్లా కమిటీ మీటింగ్ మలహాల్ రావు మండలంలోని రుద్రారం లో నిర్వహించటం జరిగింది. జిల్లా నాయకపోడ్ ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడుతూ, విద్యా, వైద్యం, ఉద్యోగాలలో నాయకపోడ్ లకు తీరని అన్యాయం జరుగుతుంది అని, కనీస అవసరాలు కూడా నోచుకోని దౌర్భాగ్య స్థితిలో ఉన్న ఆదివాసీల అమాయకత్వానికి చరమగీతం పాడాలని నాయకులు జ్ఞానం వైపు ప్రయాణించాలని సూచించారు. సెప్టెంబర్ 5 లేక 6 తేదీలలో మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది పెద్ద మొత్తంలో ఈట్టి కార్యక్రమానికి తప్పకుండా కమిటీ సభ్యులు హాజరు కావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల మాజి అధ్యక్ష కార్యదర్శులు మల్లేష్ సత్యం నాయకపోడు సంఘం అధ్యక్షులు గొట్టం భూమయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 1 న సి పి ఎస్ ఉద్యోగుల ఆత్మగౌరవ సభ

### తెలంగాణ సి.పి.ఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు -లింగమొల్ల దర్శన్ గౌడ్

**హైదరాబాద్ బ్యూరో,17 ఆగష్టు (కెరటం న్యూస్):** ఉద్యోగులకు భద్రత లేని సి.పి.ఎస్ విధానాన్ని రద్దుచేసి 1980 రివైజ్డ్ పెన్షన్ రూల్స్ ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధ రించాలని, ఉద్యోగులు వృద్ధాప్యంలో పదవీవిరమణ అనంతరం ఆత్మగౌరవంతో జీవించాలని కోరుతూ సెప్టెంబర్ 1 న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సి.పి.ఎస్ ఉద్యోగుల ఆత్మ గౌరవసభ నిర్వహిస్తున్నామని తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లింగమొల్ల దర్శన్ గౌడ్ తెలిపారు. హైదరాబాద్ లొ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ సి.పి.ఎస్ రద్దుచేసేవరకు రాజీలేని పోరాటం చేస్తామని,అధిక సంఖ్యలో సి.పి.ఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు హాజరై సి.పి.ఎస్ ఉద్యోగుల ఆత్మ గౌరవసభ ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.రామకృష్ణ మాట్లాడుతూ..... ప్రభుత్వం చేపడుతున్న ప్రజాసంక్షేమ పథకాలను ప్రజలకు చేరుస్తూ ప్రభుత్వాని ప్రజలకు మధ్య వారధిగా సుమారు 30-35 సంవత్సరాలు విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఈ సి.పి.ఎస్ విధానం వల్ల పదవీవిరమణ అనంతరం వృద్ధాప్యంలో పెన్షన్,హెల్త్ కార్డులు లేక ఆర్థిక, అనారోగ్య సమస్యలతో మానసిక ఆందోళన చెందుతున్నారని, ఉద్యోగుల సంక్షేమం ప్రభుత్వాల బాధ్యత కాబట్టి ఉద్యోగులకు,ప్రభుత్వానికి ఆర్థిక భారంగా మారిన సి.పి.ఎస్ విధానాన్ని రద్దుచేసి ఉద్యోగులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగవెల్లి ఉపెందర్ మాట్లాడుతూ..... పాత పెన్షన్ ప్రకటన కోసం రాష్ట్రంలోని 2 లక్షల పై చిలుకు సి.పి.ఎస్ ఉద్యోగుల కుటుంబాలు ఆశగా ఎదురుచూస్తున్నాయని, ఉద్యోగుల ఆకాంక్షను గుర్తించిన తెలంగాణ ముఖ్యమంత్రి



వర్యులు రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గత అసెంబ్లీ ఎన్నికల్లో మ్యానిఫెస్టోలో పెట్టినప్పటికీ కాలయాపన చేయడంతో పదవీవిరమణ పొందిన ఉద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని సి.పి.ఎస్ విధానం రద్దు ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే సాధ్యం అని ఉద్యోగులు భలంగా విశ్వసిస్తున్నారని ప్రభుత్వం త్వరగా సి.పి.ఎస్ విధానాన్ని రద్దుచేసి 1980 రివైజ్డ్ పెన్షన్ రూల్స్ ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తూ ప్రకటించి రాష్ట్రంలోని రెండు లక్షల పై చిలుకు ఉద్యోగ ఉపాధ్యాయుల కుటుంబాలలో వెలుగులు నింపాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు లెక్కల వీరేశం, మంగ నర్సింహులు, మారం లింగారెడ్డి, లింగం శ్రీనివాస్, క్రిష్ణారావు, మున్నూరు నాగన్న,శోభన్, శిరందాసు రాందాసు,సందీప్ ,భూలక్ష్మి ,ఇలియాస్, తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే నెలలో ఆసియా కప్.. మిస్టరీ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా వచ్చేస్తున్నాడు..!



స్పోర్ట్స్ న్యూస్,17 ఆగష్టు (కెరటం న్యూస్): టీమిండియా స్టార్ ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా వచ్చే నెలలో జరుగనున్న ఆసియా కప్ ఆడనున్నాడు. ఈ మేరకు అందుబాటులో ఉంటానని సెలెక్టర్లకు సమాచారం అందించినట్లు సమాచారం. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ ఆగస్టు 19న ముంబయిలో సమావేశమై ఆసియా కప్ కోసం 15 మందితో జట్టును ఎంపిక చేయనున్నట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ఆసియా కప్ సెప్టెంబర్ 9 నుంచి 28 వరకు యూఏఈ వేదికగా జరుగనున్నది. ఈ సారి ఈ టోర్నమెంట్ టీ20 ఫార్మాట్‌లో జరుగుతుంది. ఆసియా కప్ ఆడుతానని బుమ్రా సెలెక్టర్లకు చెప్పినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ వారం చివరలో సెలక్షన్ కమిటీ సభ్యులు సమావేశమై చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

చివరిగా ఇంగ్లండ్‌తో టెస్టుల్లో..

బుమ్రా చివరిసారిగా ఇంగ్లండ్ పర్యటనలో ఐదు టెస్టుల మ్యాచుల్లో మూడు మాత్రమే ఆడిన విషయం తెలిసింది. పని భారం నేపథ్యంలో కేవలం మూడు మ్యాచులు ఆడాడు. అండర్సన్-సచిన్ టెండూల్కర్ సిరీస్‌లో చివరిదైన ఐదో టెస్టుకు ముందు బుమ్రాను బీసీసీఐ రిలీజ్ చేసింది. ఇంగ్లండ్ పర్యటనలో తొలి టెస్ట్ ఆడిన బుమ్రాకు రెండో టెస్టులో విశ్రాంతి ఇచ్చారు. అనంతరం మూడు, నాలుగు టెస్టులకు అందుబాటులో ఉన్నాడు. ఓవల్ వేదికగా జరిగిన ఐదో టెస్టుకు దూరంగా ఉన్నాడు. ఈ టెస్ట్ సిరీస్‌లో బుమ్రా మొత్తం 119.4 ఓవర్లు బౌలింగ్ చేసి రెండుసార్లు ఐదు వికెట్లు పడగొట్టాడు.

చాలాకాలం తర్వాత టీ20లోకి బుమ్రా..

చాలాకాలం తర్వాత టీ20 ఫార్మాట్‌లో కనిపించనున్నాడు. టీ20ల్లో ఎక్కువగా ఓవర్లు స్పెల్స్ వేయాల్సిన అవసరం ఉండదు. దాంతో ఏ మ్యాచ్‌లో విశ్రాంతి ఇవ్వాలో నిర్ణయించుకునే అవకాశం కూడా టీమ్ మేనేజ్‌మెంట్‌కు ఉంటుంది. ఆసియా కప్ ప్రారంభానికి, చివరి మ్యాచ్ ఆడిన మ్యాచ్‌కు మధ్య బుమ్రాకు 40 రోజుల విరామం ఉంటుంది. గతేడాది టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో బుమ్రా భారత్ తరపున చివరి మ్యాచ్ ఆడాడు. ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై భారత్ ఏడు పరుగుల తేడాతో గెలిచింది. ఆ మ్యాచ్‌లో మిస్టరీ బౌలర్ 18 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు.

ముందస్తుగానే యూఏఈకి భారత్..

ఆసియా కప్ కోసం భారత జట్టు త్వరలోనే యూఏఈ చేరుకోనున్నది. జట్టులోని చాలా మంది ఆటగాళ్లు ఎలాంటి ప్రాక్టీస్ మ్యాచ్ లేకుండానే ఆసియాకప్‌కి వెళ్లబోతున్నారు. దాంతో బెంగళూరులో స్వల్పకాలిక శిబిరం ఏర్పాటు చేయాలకుంటున్నారా? అని బీసీసీఐ టీమ్ మేనేజ్‌మెంట్‌ను కోరింది. అయితే, ఆటగాళ్లు పరిస్థితులకు అలవాటు పడటానికి కొంచెం ముందుగానే యుఏఈ చేరుకోవడం మంచిదని జట్టు యాజమాన్యం భావిస్తోంది. శిబిరాన్ని ఏర్పాటు చేయడానికి బదులుగా, టోర్నమెంట్ ప్రారంభానికి ముందు వారు మంచి ప్రాక్టీస్ చేయగలిగితే జట్టు మూడు-నాలుగు రోజుల ముందుగానే యూఏఈకి వెళుందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

# అండర్-19 ప్రపంచకప్‌లో అమెరికా




స్పోర్ట్స్ న్యూస్,17 ఆగష్టు ( కెరటం న్యూస్): జింబాబ్వే, నమీబియా వేదికలుగా వచ్చే ఏడాది జరిగే ప్రతిష్ఠాత్మక అండర్-19 ప్రపంచకప్ టోర్నీకి అమెరికా జట్టు అర్హత సాధించింది. తద్వారా మెగాటోర్నీకి బెర్తు దక్కించుకున్న 16వ జట్టుగా అమెరికా నిలిచింది. రీజినల్ క్వాలిఫికేషన్‌లో భాగంగా రౌండ్‌రాబిన్ ఫార్మాట్‌లో జరిగిన టోర్నీలో కెనడా, బెర్ముడా, అర్జెంటీనాపై అమెరికా విజయాలు సాధించింది.

కెనడాపై 65 పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన అమెరికా బెర్ముడా, అర్జెంటీనాను చిత్తుచేసి 10 పాయింట్లతో గ్రూపులో అగ్రస్థానంలో నిలిచింది. టాపార్డర్ బ్యాటర్ అమరిందర్‌సింగ్ 199 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలువగా, అన్వరాయ్, సాహిర్ భాటియా ఏడేసి వికెట్లతో జట్టు విజయాల్లో కీలకమయ్యారు.

2024 ప్రపంచకప్‌లో టాప్-10లో నిలిచిన జట్లు నేరుగా అర్హత సాధించగా, మిగిలిన ఆరు జట్లు రీజినల్ టోర్నీల ద్వారా బెర్తులు సొంతం చేసుకున్నాయి. ఆతిథ్య దక్షిణాఫ్రికా, జింబాబ్వే సహా భారత్, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఇంగ్లండ్, ఐర్లాండ్, పాకిస్థాన్, న్యూజిలాండ్, శ్రీలంక, వెస్టిండీస్, అమెరికా, టాంజానియా, ఆఫ్ఘనిస్థాన్, జపాన్, స్కాట్లాండ్ అర్హత సాధించాయి.

# ఓటీటీలోకి ఫహాద్ ఫాజిల్ మూవీ



మూవీ న్యూస్,17 ఆగష్టు (కెరటం న్యూస్): ఓటీటీ ప్రేక్షకులను థ్రిల్ చేసేందుకు మరో సినిమా సిద్ధమైంది. 'నెట్‌ఫ్లిక్స్' వేదికగా ఈ నెల 22 నుంచి స్ట్రీమింగ్ కానుంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ ఆడియోతో అలరించనుంది. అదే 'మారీశన్' . ఫహాద్ ఫాజిల్ , వడివేలు ప్రధాన పాత్రల్లో నటించిన తమిళ చిత్రం ఇది. సుదీశ్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా జులైలో బాక్సాఫీసు వద్ద సందడి చేసింది.

దయాలన్ (ఫహాద్) ఓ దొంగ. అల్జీమర్స్‌తో బాధపడుతున్న వేలాయుధం పిళ్లై (వడివేలు) వద్ద చాలా డబ్బు ఉందని తెలుసుకుంటాడు. స్నేహితుడిని కలిసేందుకు వేలాయుధం ఊరు బయలుదేరగా.. చోరీ చేసేందుకు అదే సరైన సమయమని ఫిక్స్ అవుతాడు. మాటలతో వేలాయుధాన్ని ముగ్గులోకి దింపి, తన బైక్‌పైనే వెళ్లేలా చేస్తాడు. ఆ ప్రయాణంలో ఏం జరిగింది? తాను అనుకున్నట్టే దయాలన్ దోచుకున్నాడా? వేలాయుధం పరిస్థితి తెలుసుకుని వదిలేశాడా? అన్నది ఈ సినిమాలో కీలకాంశం.

# రజనీకాంత్ పోస్టుపై స్పందించిన పవన్ కల్యాణ్



మూవీ న్యూస్,17 ఆగష్టు (కెరటం న్యూస్): పొలిటికల్ తుపాను అని పవన్ కల్యాణ్ ను ఉద్దేశించి రజనీకాంత్ ట్వీట్ చేయడం, దానికి పవన్ బదులివ్వడం నెట్టింట అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. రజనీకాంత్ నట ప్రస్థానానికి 50 ఏళ్లు పూర్తయిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ ఆయనకు ఇటీవల శుభాకాంక్షలు తెలిపారు. దానిపై రజనీకాంత్ ఆదివారం స్పందించారు. “ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, నా సోదరుడు, పొలిటికల్ తుపాను పవన్ కల్యాణ్ గారు.. ప్రేమతో మీరు చెప్పిన విషెస్‌కు ఉప్పొంగిపోయా. దాన్ని ఓ గౌరవంగా భావిస్తున్నా. మీకు హృదయపూర్వక ధన్యవాదాలు” అని రజనీకాంత్ పేర్కొన్నారు.దానిపై పవన్ కల్యాణ్ స్పందిస్తూ.. “బిగ్ బ్రదర్ రజనీకాంత్.. మీ అభిమానం, ఆశీస్సులకు కృతజ్ఞుడిని. మీ మాటలు నా హృదయాన్ని తాకాయి. మీరు మరిన్ని విజయాలు అందుకోవాలని, ఎప్పుడూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నా” అని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, నటుడు కమల్‌హాసన్ తదితరులు రజనీకాంత్‌కు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపిన సంగతి తెలిసిందే. రజనీకాంత్ నటించిన తాజా చిత్రం 'కూలీ' ప్రస్తుతం థియేటర్లలో సందడి చేస్తోంది.

# ఆ మలయాళ దర్శకుడితో సూర్య కొత్త సినిమా?



మూవీ న్యూస్,17 ఆగష్టు (కెరటం న్యూస్): తమిళ సినీ పరిశ్రమలో తన నటనతో ప్రత్యేకమైన స్థానం సంపాదించుకున్న హీరో సూర్య ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ప్రతి సినిమా ద్వారా కొత్తదనం చూపించాలనే తపనతో ముందుకు సాగుతున్న ఆయన, ఒకవైపు యాక్షన్ డ్రామాలు చేస్తే మరోవైపు కంటెంట్ బేస్డ్ సినిమాలకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. ఇప్పటికే ఆయన నటించిన 'జై భీమ్', 'సూరరై పోట్రు' లాంటి సినిమాలు నేషనల్ లెవెల్‌లో ప్రశంసలు అందుకోవడంతో పాటు అవార్డులు కూడా దక్కించుకున్నాయి. ఇక ఇప్పుడు ఆయన చేతిలో ఉన్న ప్రాజెక్టులు కూడా అభిమానుల్లో భారీ అంచనాలను క్రియేట్ చేస్తున్నాయి. ఇందులో భాగంగా ప్రజెంట్ సూర్య నటించిన తాజా చిత్రం 'కరుప్పు' త్వరలోనే థియేటర్ లో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. అదే సమయంలో తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరి తో చేస్తున్న సినిమా కూడా షూటింగ్ దశలో ఉంది. వీటికి తోడు, సూర్య మరో క్రేజీ ప్రాజెక్టుకి కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఇండస్ట్రీ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. సమాచారం ప్రకారం 'సూర్య 47' వర్కింగ్ టైటిల్‌తో రూపొందనుందని సమాచారం. మలయాళంలో వరుస విజయాలు సాధించిన జీతూ మాధవన్ ఈ సినిమాకి దర్శకత్వం వహించనున్నారని టాక్. ఆయన తెరకెక్కించిన 'రోమాంచమ్' 'ఆవేశం' లాంటి సినిమాలు బాక్సాఫీస్ దగ్గర సూపర్ హిట్స్ కావడంతో సౌత్‌లో ఆయనపై మంచి బజ్ క్రియేట్ అయింది. ఇలాంటి క్రియేటివ్ డైరెక్టర్‌తో సూర్య జత కడుతున్నారని వినిపించడంతో అభిమానుల్లో హైప్ మరింత పెరిగింది. అదే కాకుండా, ఈ ప్రాజెక్టును ఒక ప్రముఖ తమిళ నిర్మాణ సంస్థ భారీ బడ్జెట్‌తో తెరకెక్కించబోతోందని టాక్. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశముంది. ఈ కాంబినేషన్ ఫైనల్ అయితే, సూర్య కెరీర్‌లో ఇది మరో క్రేజీ మైలురాయిగా నిలిచే అవకాశం ఉంది.